ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానించిన తింసాన్‌పల్లి గ్రామస్తులు

పెద్దేముల్, సెప్టెంబర్ 12 : తింసాన్‌పల్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినందుకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రుణపడి ఉంటామని తింసాన్‌పల్లి గ్రామస్తులు అన్నారు. గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గ్రామస్తులు స్థానిక మండల నాయకులతో కలిసి ప్రత్యేక గ్రామ పంచాయతీగా తింసాన్‌పల్లి గ్రామాన్ని ఏర్పాటు చేసినందుకు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసిన క్రమంలో గ్రామస్తులందరూ పార్టీలకతీతంగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని, గ్రూపు రాజకీయాలు చేసుకొని గ్రామాభివృద్ధిని అడ్డుకోరాదని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా గ్రామాభివృద్ధికి పాటుపడే మంచి వ్యక్తిని గ్రామస్తులందరూ సమష్టిగా నిర్ణయించుకొని ఎంపిక చేసుకొని గెలిపించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేవీ హెడ్‌క్వార్టర్ సందర్శన

పరిగి, సెప్టెంబర్ 12 : ఢిల్లీలోని నేవీ హెడ్ క్వార్టర్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సందర్శించారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే నేవీ రాడార్‌ను వీక్షించి వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని పూడూరు మండలంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ వల్ల పరిగి ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

నేవీ హెడ్‌క్వార్టర్‌ను సందర్శించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మండల కేంద్రంలో చిన్నారులు ప్రతిష్ఠించిన మట్టి గణపతిని గురువారం బొంరాస్‌పేట పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ఆరు రోజులపాటు భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు నిర్వహించిన అనంతరం గురువారం లడ్డూ, కలశం, వస్త్రాలను వేలం వేశారు. పూజలు చేసిన తరువాత గణనాథుడిని నిమజ్జనం చేశారు. - బొంరాస్‌పేట, సెప్టెంబర్ 12

వినాయకుడికి పూజలు

పరిగి, సెప్టెంబర్ 12 : పరిగి పట్టణంలోని బ్రాహ్మణవాడలో ప్రతిష్ఠించిన వినాయకుడికి గురువారం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా, భక్తిభావాలు పెంపొందేలా ఉత్సవాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా స్వయంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, సెప్టెంబర్ 12 : అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అక్కడి సమావేశాల్లో భారత వ్యతిరేక వ్యక్తులు, శక్తులతో సమావేశం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశాన్ని వ్యతిరేకిస్తూ, విభేదిస్తూ, అవకాశం ఉన్నప్పుడల్లా భారతదేశంపై విషం చిమ్మే అమెరికా శాసనసభ్యురాలు, పాకిస్తాన్ సమర్థకురాలు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశమవ్వడాన్ని తప్పుబట్టారు. పరిస్థితులు అనుకూలిస్తే భారతదేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తామని రాహుల్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ అసలు రంగు, కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. విదేశీ పర్యటనల్లో భారతదేశం పట్ల, భారతదేశ ప్రజాస్వామ్యం పట్ల, ప్రజలను అవమానించేలా విమర్శలు చేయడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజామోదంతో బీజేపీ గెలుపొందితే.. ఆఖరుకు ప్రజల తీర్పును సైతం అవమానించేలా రాహుల్ మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని కించపర్చడమేనని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు రిజర్వేషన్లను రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నెహ్రూ నుంచి మొదలు సామాజికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు వ్యతిరేకించారని, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్‌ను ఓడించిన దౌర్భాగ్య చరిత్ర కాంగ్రెస్‌దేనని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు కుర్వ దత్తు మరణించడంతో ఆయన కుటుంబానికి నాందార్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీమల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి సభ్యులు రూ.11వేలు ఆర్థిక సహాయం అందించారు. - బొంరాస్‌పేట, సెప్టెంబర్ 12

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మర్పల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

మర్పల్లి, సెప్టెంబర్ 12 : పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్ యాదవ్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 47 మంది దవాఖానల్లో చికిత్సలు చేయించుకున్న బిల్లులతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బిల్లులు రావడంతో.. గురువారం మర్పల్లిలో తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశాలతో మండల నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేసినట్లు సురేశ్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ నవీన్‌కుమార్ గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. - వికారాబాద్, సెప్టెంబర్ 12

వక్ఫ్ చట్ట సవరణను ఆపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంఐఎం నాయకులు, ముస్లింలు

కొడంగల్, సెప్టెంబర్ 12 : పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను వెంటనే ఆపాలని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్బీ గుల్షన్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఎంఐఎం ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింల సంపదను దెబ్బతీయడంతో పాటు సమాజాన్ని ఆర్థికంగా బలహీనపరచేలా ఈ బిల్లు రూపొందించినట్లు ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణను వెంటనే ఆపకపోతే అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాన్ని చేపడతామని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సామాజిక, నైతిక విలువలను కాపాడుదాం

కొడంగల్, సెప్టెంబర్ 12 : సామాజిక, నైతిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సేవక్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారులు, లయన్స్‌క్లబ్, రామకృష్ణ సేవా సమితి సహకారంతో 'మేము సైతం యవతకోసం' కార్యక్రమంలో భాగంగా నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మానాన్నలు లేకుంటే మనం లేమని, వారిని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత బిడ్డలందరిదని పేర్కొన్నారు. నేటి రోజుల్లో యుక్త వయస్సు రాగానే జీవితం, ఉద్యోగం, పెళ్లాం, పిల్లలు అనుకుంటూ అసలు జీవితాన్నిచ్చిన తల్లిదండ్రులను వదిలేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మూగ జీవరాసులు సైతం కన్నతల్లిదండ్రుల పట్ల మమకారాన్ని చూపుతాయని, వాటి కంటే మానవులు హీనంగా మారడం సరికాదన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని చాలా మంది అమ్మానాన్నలకు గర్భశోకాన్ని మిగిలిస్తున్నట్లు తెలిపారు. ఇది సరైన చర్య కాదని, ఒకసారి తప్పితే మళ్లీ ప్రయత్నంచి సాధించి లక్ష్యం చేరుకోవాలన్నారు. అన్నింటినీ ఎదుర్కొంటూ ఆశయాన్ని సాధించడమే మన కర్తవ్యంగా పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలని సూచించారు.

నేడు మండల సమావేశం

కొడంగల్, సెప్టెంబర్ 12 : మండల ప్రత్యేకాధికారి ఆదేశానుసారం శుక్రవారం మండల పరిధిలోని ప్రగతికి సంబంధించి అధికారుల సమావేశాన్ని నిర్వహించినున్నట్లు ఎంపీడీవో ఉషశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మధ్యాహ్నం 2గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు, అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాల్సి ఉంటుందని సూచించారు.

ఇప్పుడు వరి నాట్లు వేస్తే దిగుబడులు తగ్గుతాయి

దోమ, సెప్టెంబర్ 12 : సెప్టెంబర్ మాసంలో వరి నాట్లు వేసినట్లయితే దిగుబడులు తగ్గి నష్టం వచ్చే అవకాశం ఉంటుందని.. ఇతర పంటలను సాగు చేసుకొని మంచి లాభాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట పూత దశకు చేరుకునే సమయానికి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం వలన పూత సరిగా రాకపోవడం.. వరి కంకులు ఎన్నులో నుంచి బయటకు రాకపోవడం వంటి అనుకూల కారణాల వలన అతి తక్కువ దిగుబడులు నమోదై రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనువైన మొక్కజొన్న, సజ్జలు, రాగులుతోపాటు అపరాలైన పెసర, మినుము, ఉలవలు మొదలగు పంటలు విత్తుకోవచ్చని సూచించారు.

జోనల్ లెవల్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో పాల్గొనండి

కొడంగల్, సెప్టెంబర్ 12 : జోనల్ లెవల్ (ఎస్‌జీఎఫ్) ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఎంఈవో రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో క్రీడలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఇందులో నియోజకవర్గపరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలకు సంబంధించిన పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 19న వాలీబాల్ పోటీలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కొడంగల్‌లో, 20న ఖోఖో పోటీలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కొడంగల్‌లో, 21న కబడ్డీ పోటీలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రావులపల్లి పాఠశాలల ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అండర్-17, అండర్-14 విద్యార్థులు తమతమ పాఠశాలల్లోని పీడీల ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓటర్ల జాబితాలో వివరాలు సరిచూసుకోవాలి

పరిగి, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుందని పరిగి మండల అభివృద్ధి అధికారి ఎంఏ కరీం తెలిపారు. ఓటర్ల జాబితాలో వివరాలు సరిచూసుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని ఆయన సూచించారు.

నీటి గుంతలో పడి బాలుడు మృతి

కులకచర్ల, సెప్టెంబర్ 12 : నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన కులకచర్ల మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. సాల్వీడ్ గ్రామానికి చెందిన చెంచులక్ష్మి, బాబు దంపతులు గురువారం గ్రామ సమీపంలో వారి పొలంలో పనులు నిర్వహిస్తుండగా.. పక్కనే ఉన్న రైతు పొలంలో నీటి గుంత దగ్గరకు వారి కుమారుడు వీరభద్ర(3) ఆడుకుంటూ వెళ్లి నీటి గుంతలో పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెళ్లి చూడగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

తాపస్ మోమిన్‌పేట మండల కార్యవర్గం ఎన్నిక

వికారాబాద్ : మోమిన్‌పేట మండలం టేకులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం తాపస్ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు తాపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా డి.మధుకర్, ప్రధాన కార్యదర్శిగా కె.మహేశ్, కోశాధికారిగా చంద్రశేఖర్, మీడియా కన్వీనర్‌గా మహేందర్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు.

మెరిట్ స్కాలర్‌షిప్ కోసం కష్టపడి చదవాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 12 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పొందడానికి నిర్వహించే పరీక్షలో అర్హత సాధించడానికి విద్యార్థులు కష్టపడి చదవాలని రిసోర్స్ పర్సన్ బాకారం చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. గురువారం బొంరాస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌పై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 8వ తరగతి నుంచి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే అర్హత సాధించడం కష్టమేమి కాదని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు చెప్పే తరగతులను శ్రద్ధగా వినాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ప్రశాంత్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయులకు సమాజంలో ఉన్నత స్థానం

మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం

బంట్వారం(కోట్‌పల్లి), సెప్టెంబర్12 : సమాజంలో ఉపాధ్యాయులకు ఉన్నతమైన స్థానం ఉందని ఇన్‌చార్జి ఎంపీడీవో డానియేల్ పేర్కొన్నారు. గురువారం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఆయన అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనారంటే వారి మంచితనం, కృషి, పట్టుదల, ఉద్యోగం, సమాజం పట్ల ఉన్న అంకితభావంతోనే లభించిందన్నారు. ఉత్తమంగా గుర్తింపు పొందాక వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనవారు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, అంకితభావంతో పని చేసి, ఉత్తమ పౌరులను రూపొందించాలని ఎంఈవో చంద్రప్ప సూచించారు. ప్రతి విద్యార్థి ఎలాంటి దశలో ఉన్నా వారిని ముందుకు తీసుకురావడం మనందరి బాధ్యతని వ్యాఖ్యానించారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులు సునీత, జయశ్రీ, మల్లేశ్వరి, నరేశ్, మౌనిక, యాదమ్మ, నర్సింహులు, లావణ్య, జ్యోతిలక్ష్మి, మల్లేశం, రామకృష్ణాగౌడ్, శ్రీలతలతో పాటు, తెలంగాణ ప్రభుత్వ అవార్డు గ్రహీత మాధవి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు బుచ్చిరెడ్డి, ఫాతిమా బీగం, ఉమేశ్, ఆంజనేయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ ప్రవంతి, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, విశ్వేశ్వర్, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యంతో పట్టుబడినవారితో ఎస్ఐ సంతోష్‌కుమార్

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పరిగి, సెప్టెంబర్ 12 : రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పరిగి పోలీసులు పట్టుకొని వాహనం సీజ్ చేశారు. షాద్‌నగర్ గ్రామానికి చెందిన కేతావత్ రాహుల్, కులకచర్ల మండలం గుబ్బడితండాకు చెందిన కేతావత్ బల్‌రాం మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు ఈ నెల 11న ఉదయం 7 గంటల ప్రాంతంలో ఓ వాహనంలో రాఘవాపూర్ చౌరస్తా నుంచి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ అధికారికి సమాచారం ఇవ్వగా 12న ఉదయం పోలీస్టేషన్‌కు వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యమని నిర్ధారించారు. 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

కుక్క కాటు బాధితుడికి ఆర్థిక సాయం

వికారాబాద్ : మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలో కుక్క కాటుకు గురైన తూర్పు కిష్టయ్యను గురువారం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ నాయకులతో కలిసి వెళ్లి సొంతంగా చికిత్స చేయించారు. వారిని పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశారు. పూర్తిస్థాయి వైద్యానికి తన వంతు సాయం చేస్తానని మాట ఇచ్చారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

పరిగి, సెప్టెంబర్ 12 : దివ్యాంగులు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి పీఎన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పరిగిలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వ్యాపారం చేయాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలైన దివ్యాంగులను గుర్తించి, వారి ప్రతిభకు తగ్గట్టు వారు చేస్తున్న వ్యాపారాలను బలోపేతం చేస్తూ మెరుగైన జీవనోపాధిని పొందడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దివ్యాంగులు పింఛన్ పొందాలంటే తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్ అవసరమని పేర్కొన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన దివ్యాంగులను గుర్తించి రూ.25వేల ఆర్థిక సహాయం వస్తు రూపంలో అందించేందుకు 38 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ స్టేట్ మేనేజర్ గురుదేవి, జిల్లా కో-ఆర్డినేటర్ రామేశ్వర్, కమ్యూనిటీ మెంటార్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని సామర్థ్యాల్లో ప్రావీణ్యం కలిగి ఉండేలా బోధించాలి

దోమ, సెప్టెంబర్ 12 : ప్రతి విద్యార్థి అన్ని సామర్థ్యాల్లో ప్రావీణ్యం పొందేలా విద్యను బోధించాలని కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ అన్నారు. దోమ మండల పరిధిలోని బుద్లాపూర్ ప్రాథమిక పాఠశాలను లాల్యానాయక్ గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేసి తెలుగు, ఇంగ్లిష్, గణితం తదితర సబ్జెక్టులకు సంబంధించిన అంశాల సామర్థ్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల రిజిస్టర్లను పరిశీలించి, యూడైస్‌తో పాటుగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయాలని ప్రధానోపాధ్యాయుడికి ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబ్బాలను తొలగించాలంటూ నోటీసులు

పరిగి, సెప్టెంబర్ 12 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా పుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన డబ్బాలు తొలగించాలంటూ పరిగి మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా పుట్‌పాత్‌ను ఆక్రమించి, పక్కనే అనేక మంది డబ్బాలు ఏర్పాటు చేయడం జరిగింది. మరికొందరు ఏకంగా తమ దుకాణాల ఎదుట రేకులు ఏర్పాటు చేశారు. దీంతో వాటిని తొలగించాలంటూ నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన మూడు రోజుల్లో వాటిని తొలగించాలని పేర్కొన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఆర్థిక సాయం

కులకచర్ల, సెప్టెంబర్ 12 : చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో గ్రామానికి చెందిన కోస్గి మాసయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి రూ.5వేలు ఆయన అనుచరుల ద్వారా ఆర్థిక సహాయం అందించారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత

కులకచర్ల, సెప్టెంబర్ 12 : చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామానికి చెందిన లక్ష్మికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్బటి అశోక్‌కుమార్ అందజేశారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

కులకచర్ల, సెప్టెంబర్ 12 : కులకచర్ల మండల పరిధిలోని రాంనగర్ గ్రామ పంచాయతీ సూర్యనాయక్‌తండాలో తాళం వేసిన ఓ ఇంటిలో బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితుడు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూర్యనాయక్ తండాకు చెందిన పాత్లావత్ గోబ్యానాయక్ భార్య 5 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో.. ఇంటిని ఆరు నెలల విడిచి వేరే ఇంట్లో ఉండాలని పురోహితులు తెలియజేయగా వారి సొంత ఇంటిని విడిచి వేరే ఇంట్లో ఉంటున్నామని బాధితుడు తెలిపారు. తన భార్యకు సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలు బీరువాలో పెట్టామని తెలిపారు. గురువారం రోజు పాత ఇంటి తాళం పగులగొట్టి ఉన్న విషయాన్ని తన మనుమడు గమనించి చెప్పాడని.. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి అందులో పెట్టిన నగలను పరిశీలించగా నగలు చోరీకి గురయ్యాయని తెలిపారు. 4 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని పోలీస్టేషన్‌లో బాధితుడు గోబ్యానాయక్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం క్లూస్ టీం ద్వారా విచారణ నిర్వహించడం జరిగిందని తెలిపారు. మిగతా వివరాలను సేకరిస్తున్నట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లిన తుఫాన్ వాహనం

పరిగి, సెప్టెంబర్ 12 : మద్యం మత్తులో డ్రైవర్ వాహనాన్ని నడిపించడంతో రోడ్డు పక్కనున్న మెకానిక్ షెడ్డులోకి దూసుకువెళ్లిన ఘటన గురువారం సాయంత్రం పరిగిలో జరిగింది. హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు వెళ్తున్న బొంరాస్‌పేట్‌కు చెందిన నవీన్‌కుమార్‌కు సంబంధించిన తుఫాన్ వాహనాన్ని డ్రైవర్ అశోక్ మద్యం మత్తులో నడిపించడంతో పరిగిలో రోడ్డు పక్కన గల మెకానిక్ షాపులోకి దూసుకెళ్లింది. వెంటనే షెడ్డులోని వారు పక్కకు పరుగు తీయడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వాహనం నుంచి పొగలు రావడంతో స్థానికులు వెంటనే వాహనం బ్యాటరీ తొలగించారు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై డ్రంక్‌అండ్‌డ్రైవ్, న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.